
ఆలోచనలకు బీజం వేసేది ప్రశ్నలే..

● 'కథ-2023' పుస్తకావిష్కరణ సభలో వక్తలు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నైతి కత, జీవన విధానం, సామాజిక, రాజకీయ అంశాలను సంకలనం చేసిందే 'కథ-2023' అని ఆంధ్రజ్యోతి సంపాదకుడు కె.శ్రీనివాస్ అన్నారు. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకులుగా రూపొందించిన 15 కథల సంకలనాన్ని ఖమ్మం జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 2023లో వివిధ మాధ్యమాల ద్వారా ప్రచురితమైన 2,400 కథల్లో 15 కథలను ఎంపిక చేయటం కత్తిమీద సామేనని అభిప్రాయపడ్డారు. ప్రశ్నలతోనే ఆలోచనలు వస్తుంటాయని, వాటిని పరిగణనలోకి తీసుకుంటేనే సమాధానాలు అన్వేషించుకునే అవకాశం లభిస్తుందన్నారు. 'వైతాళికులు' సంకలనంలో జాషువాకు ఎందుకు స్థానం లభించలేదన్న సుదీర్ఘ చర్చ జరిగిందని, వీటిలో సంపాదకులు చేసే కసరత్తు అప్పటి పరిస్థితులు, ఆలోచనా ధోరణుల ఆధారంగా ఉంటాయన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు. 1990 నుంచి ఈ యజ్ఞాన్ని కొనసాగించటం యుద్ధం లాంటిదని అభివర్ణిస్తూనే సంపాదకులను అభినందించారు.


'కథ-2023' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రజ్యోతి సంపాదకుడు కె.శ్రీనివాస్, చిత్రంలో నిర్వాహకులు జ్యోతి, శ్రీనివాసరావు, రవిమారుత్, శివశంకర్, నవీన్, శివారెడ్డి

సంపాదకుడు వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ 34ఏళ్లుగా ఎంతోమంది సహకారంతో దీన్ని కొనసాగిస్తున్నామని, 15 కథల ఎంపికలో పడిన కష్టాన్ని వివరించారు. నిర్వాహకుడు రవిమారుత్ మాట్లాడుతూ సాంస్కృతికంగా, రాజకీయ అంశాలతో ఈ సంకలనం కొనసాగటం సాహితీరంగంపై పెరుగుతున్న ఆసక్తికి నిదర్శనమన్నారు. కథలు రాసిన రచయితలకు పుస్తకాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో మువ్వా శ్రీనివాసరావు, శివశంకర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా సార్లొస్తున్నారు!

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే

కొత్త ఉపాధ్యాయ పోస్టుల భర్తీ నిరీక్షణకు మరికొన్ని రోజుల్లో తెరపడనుంది. ఏళ్లుగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా విద్యార్థుల సామర్థ్యాలు ఆందోళన కలిగిస్తున్నాయని వివిధ సర్వేలు తేల్చాయి. ఈనేపథ్యంలో డీఎస్సీ-2024 ద్వారా పోస్టుల భర్తీతో కొంత ఉపశమనం కలగనుంది. పోస్టుల భర్తీకి రాష్ట్ర విద్యాశాఖాధికారులు యుద్ధప్రాతిపదికన కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను ఈనెల 2 నుంచి 5 వరకు పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదగా హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో నియామక పత్రాలను కొత్త మాస్టార్లు బుధవారం అందుకోనున్నారు.

తీరనున్న ఎస్జీటీల కొరత

పోస్టుల భర్తీ ప్రక్రియ ఆన్‌లైన్‌లో జరిగే అవకాశాలున్నాయి. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం 1:3 నిష్పత్తి నివేదికను ఆన్‌లైన్‌లో నిక్షిప్తపరిచారు. ఇందులో ఖమ్మం జిల్లాలో 1,336, భద్రాద్రిలో 971 మంది వివరాలు పొందుపరిచారు. డీఎస్సీ పోస్టుల భర్తీతో సింహభాగం సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ)ల కొరత తీరనుంది. ఏకోపాధ్యాయ పాఠశాలలకు ఊరట కలగనుంది. అలాగే ఈ ఏడాదే జిల్లాల వారీగా బదిలీల ప్రక్రియ జూన్‌లో జరిగింది. బదిలీ ఉత్తర్వులు అందుకున్నప్పటికీ చాలా చోట్ల ఉపాధ్యాయుల కొరతతో ఆయా పాఠశాలల బోధనా సిబ్బందిని డీఈఓలు బదిలీ చేయలేదు. కొత్త ఉపాధ్యాయులు అందుబాటులోకి వస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరికినట్టే.

జిల్లాల వారీగా భర్తీకానున్న పోస్టులు

	ఖమ్మం	భద్రాద్రి
ఎస్ఏలు	176	129
భాషా పండితులు	18	10
పీఈటీలు	10	01
ఎస్జీటీలు	334	268
స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్ఏలు	8	8
స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీలు	29	31




ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన డీఎస్సీ అభ్యర్థులు (పాత చిత్రం)

రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో డీఎస్సీ-2024లో ఎంపికైన అభ్యర్థులను 1:3 నిష్పత్తిలో ధ్రువపత్రాల పరిశీలనకు పిలిచి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. రాష్ట్ర విద్యాశాఖ అధికారుల దిశానిర్దేశం ప్రకారం జిల్లాల వారీగా నియామక ప్రక్రియ కొనసాగుతోంది.
- వెంకటేశ్వరాచారి, డీఈఓ, భద్రాద్రి కొత్తగూడెం

సముద్రాలు దాటుతున్న
చౌక బియ్యం



ఖమ్మం నగరం, న్యూస్‌టుడే

రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. చౌక ధరల దుకాణాల ద్వారా పేదలకు వీటిని ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తోంది. ఈ బియ్యం జిల్లా, రాష్ట్ర సరిహద్దులు దాటి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, విశాఖపట్నం ఓడరేవులకు చేరుతోంది. అక్కడి నుంచి నౌకల్లో ఆఫ్రికా దేశాలకు దర్జాగా రవాణా అవుతోంది. బియ్యం మాఫియాలో రేషన్ డీలర్ల నుంచి అనేక మంది అక్రమ వ్యాపారులు, కొందరు మిల్లర్లు పాలుపంచుకుంటున్నారు. కార్డుదారులు చాలా మంది ఉచిత బియ్యాన్ని రేషన్ డీలర్లకే ఇచ్చేసి కిలోకి రూ.5 చొప్పున తీసుకుంటున్నారు. డీలర్లు ఇలా పోగేసిన బియ్యాన్ని కొందరు అక్రమ వ్యాపారులు లారీల్లో ఓడరేవులకు తరలిస్తున్నారు. ఖమ్మంలో ఒక పేరుమోసిన వ్యాపారి, పొరుగున ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయికి చెందిన మరో వ్యాపారి కలసి ఇలా ఉచిత బియ్యాన్ని సేకరించి లారీల్లో ఓడ రేవులకు తరలిస్తూ కొన్నేళ్లుగా రూ.కోట్లకు పడగలెత్తినట్లు తెలుస్తోంది. కొన్నాళ్ల క్రితం ఈ ఇద్దరు వ్యాపారులు విడిపోయినట్లు సమాచారం.

జిల్లాలో 129 కేసులు నమోదు

జిల్లాలో బియ్యం అక్రమ రవాణా, చౌకధరల దుకాణాల తనిఖీ తదితర సంఘటనల్లో పౌర సరఫరాలశాఖ అధికారులు ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు 129 కేసులు నమోదు చేశారు. 2264.48 క్వింటాళ్ల చౌక బియ్యం స్వాధీన పరుచుకున్నారు. ఇందులో బియ్యం అక్రమ తరలింపు సంఘటనల్లో 70 కేసులు నమోదయ్యాయి. రూ.16.30 లక్షల విలువైన బియ్యం, రూ.54.98 లక్షల విలువైన 26 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

బియ్యం అక్రమ రవాణాపై నిఘా
చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి

పీడీఎస్ (పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం) బియ్యం అక్రమ రవాణాపై గట్టి నిఘా ఏర్పాటు చేశాం. మా సిబ్బంది రాత్రిళ్లు సంచరిస్తున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఖమ్మం జిల్లా మీదుగా ఏపీ లోకి అక్రమ బియ్యం తరలిస్తున్నారు. వాటిని నిలువరించేందుకు ప్రయత్నిస్తున్నాం. మరోవైపు పోలీసులు దాడులు జరుపుతున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 129 కేసులు నమోదు చేశాం. వాహనాలను పోలీస్ స్టేషన్లలో అప్పగించాం. కోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చిన తర్వాతే వాహనాలు విడిచిపెడుతున్నాం.

ఖమ్మంలోని బియ్యం వ్యాపారి ఒక ప్రముఖ రేషన్ డీలర్‌తో కలిసి అక్రమ వ్యాపారం సాగిస్తున్నట్లు సమాచారం. ఎన్టీఆర్ జిల్లా వత్సవాయికి చెందిన వ్యాపారి ఉన్నతాధికారులకు ఉప్పందిస్తున్నట్లు ఖమ్మంలోని అక్రమార్కులు అనుమానిస్తున్నారు. ఇటీవల కాలంలో బియ్యం లారీలు మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పట్టుబడ్డాయి. ఖమ్మంలోని జంట వ్యాపారులు రూటు మార్చినట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ఇలాంటి బియ్యం లారీలు ఖమ్మం జిల్లా మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోకి వెళ్లే సమయంలో అధికారులకు పట్టుబడుతున్నాయి. ఉచితంగా ఇచ్చే దొడ్డు బియ్యం తినేవారు తక్కువగా ఉన్నారు. అందుకే రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది.

జమలాపురంలో కుంకుమార్చన


కుంకుమార్చన పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నాలుగో రోజు ఆదివారం తెల్లవారుజామున నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పద్మావతీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. యాగశాలలో నవగ్రహ హోమం నిర్వహించగా, దుర్గాదేవి అమ్మవారు భక్తులకు అన్నపూర్ణాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. శ్రీవారిని, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అన్నపూర్ణ భవన్‌లో 500 మందికి అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, పర్యవేక్షకురాలు కె.విజయకుమారి, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాస్‌శర్మ, మురళీమోహనశర్మ, అర్చకులు పాల్గొన్నారు.

రైతు మృతిపై విచారణ


తీగలు తెగిపడ్డ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏడీఈ తిలక్

చింతకాని, న్యూస్‌టుడే: లచ్చగూడెం గ్రామానికి చెందిన రైతు గూని ప్రసాద్(55) స్ప్రేయర్ సాయంతో మందు పిచికారి చేస్తూ విద్యుదాఘాతంతో పంట పొలంలోనే మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. రైతు మృతి, విద్యుత్తు సంస్థ సిబ్బంది నిర్లక్ష్యంపై నిఘా వర్గాలు భిన్న కోణాల్లో గ్రామంలో ఆరా తీసినట్లు విశ్వసనీయ సమాచారం. ఘటనా స్థలాన్ని పెద్దగోపతి పరిధి ఏడీఈ తిలక్, ఏఈ వెంకన్న ఆదివారం పరిశీలించారు. విద్యుత్తు తీగలపై చెట్టు కొమ్మలు పడటం వల్ల అవి తెగి వరి పొలంలో పడినట్లు గుర్తించారు. ఉన్నతాధికారులు సైతం ఘటనపై శాఖాపరమైన విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

◆ రైతు మృతదేహాన్ని మధిర ఆసుపత్రిలో జడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు సందర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ప్రసాద్ అంత్యక్రియలు ఆదివారం జరిగాయి.



ప్రమాదం అంచున ప్రయాణం



ఆర్‌అండ్‌బీ రహదారుల వెంట కొన్నిచెట్లు ఎండిపోయి ప్రమాదకరంగా మారాయి. వైరా నుంచి తల్లాడ జాతీయ రహదారితోపాటు వైరా నుంచి మధిర వెళ్లే మార్గం లోనూ ఎండిన చెట్లు రోడ్డువైపు వంగి ఎప్పుడు కూలి వాహనదారులపై పడతాయేమోనన్నట్టు తయారయ్యాయి. పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ ఏఈ విశ్వనాథం 'న్యూస్‌టుడే'కు తెలిపారు.
- వైరా, న్యూస్‌టుడే


మధిర వెళ్లే మార్గంలో ప్రమాదకరంగా మారిన ఎండిన చెట్టు

గతంతో పోలిస్తే జ్వరాలు తగ్గుముఖం: డీహెచ్

సత్తుపల్లి, న్యూస్‌టుడే: ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంతోనే ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా జ్వరాలు తగ్గుముఖం పట్టాయని వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుడు బి.రవీంద్ర నాయక్ అన్నారు. సత్తుపల్లిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఇన్‌ఛార్జి డీఎంఅండ్‌హెచ్‌వో వి.సుబ్బారావుతో కలిసి ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాల గదులకు వెళ్లి రికార్డులను తనిఖీ చేశారు. వార్డులకు వెళ్లి వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 15-20 ఏళ్ల క్రితంతో పోలిస్తే వైద్య రంగంలో చాలా మార్పులు వచ్చాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు గొప్పగా ఉన్నాయని చెప్పారు. ఏటా వర్షాకాలంలో వాతావరణ మార్పులతో డెంగీ, మలేరియా, గన్యా, టైఫాయిడ్, స్వైన్‌ఫ్లూ వ్యాపిస్తుంటాయన్నారు. ఈ ఏడాది మే నెల నుంచే వైద్యారోగ్య, పంచాయతీరాజ్, మున్సిపాలిటీల అధికారులతో పలుమార్లు సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసి చాలా వరకు జ్వరాలను నియంత్రించగలిగామని చెప్పారు. 2019లో ఎక్కువగా డెంగీ కేసులు వచ్చాయని, 2020లో కొవిడ్ కారణంగా జ్వరాలు తగ్గాయని, 2021 నుంచి ఇప్పటివరకు జ్వరాలు తగ్గుముఖం పడుతున్నాయని వివరించారు. మందుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. వైద్య సిబ్బంది ఇటీవల వరద బాధితులకు అద్భుతంగా సేవలందించారన్నారు. కల్లూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ టి.సీతారామ్, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


మహిళతో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుడు రవీంద్రనాయక్. చిత్రంలో డీఎంహెచ్‌ఓ సుబ్బారావు తదితరులు

ఖమ్మంలో వేగం.. భద్రాద్రిలో మందగమనం

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం, న్యూస్‌టుడే, కొత్తగూడెం కలెక్టరేట్

ప్లాట్లు, లేఅవుట్ అనుమతి లేని స్థలాలను క్రమబద్ధీకరించేందుకు భారాస ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం అవకాశం కల్పించింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జల్లాల్లో వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. క్రమబద్ధీకరణ చేపట్టే క్రమంలో తలెత్తిన వివిధ సమస్యల వల్ల ప్రక్రియ నిలిచిపోయిన విషయం విదితమే. గతేడాది అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఎల్‌ఆర్‌ఎస్ అంశాన్ని మళ్లీ తెరపైకి తెచ్చింది. అక్రమాలకు తావులేకుండా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను మూడు నెలల్లో పూర్తిచేయాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ ఏడాది ఆగస్టులో కలెక్టర్లను ఆదేశించారు. అధికారులు పరిశీలన ప్రక్రియలో నిమగ్నమైనా ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించటం లేదు.

ఉభయ జిల్లాల్లో..

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ఖమ్మం జిల్లాలో జోరందుకోగా.. భద్రాద్రి జిల్లాలో మందగమనంగా సాగుతోంది. ఖమ్మం కార్పొరేషన్, మున్సిపాలిటీలు, సుడా, గ్రామపంచాయతీల వారీగా మొత్తం 98,270 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ప్రస్తుతం సుమారు 7,500 దరఖాస్తులు మాత్రమే అధికారుల పరిశీలనలో ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు పురపాలికల పరిధిలో 9,461 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 3,328 దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. 419 దరఖాస్తులకు అనుమతులివ్వగా 331 దరఖాస్తులను తిరస్కరించారు. 6,133 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వచ్చిన వాటిలో 8,779 దరఖాస్తులు పాల్వంచ పురపాలికకు చెందినవి కావటమే గమనార్హం.




మూడు శాఖల సమన్వయంతో..

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పురపాలిక, నీటిపారుదల, రెవెన్యూ శాఖల సమన్వయంతో సాగుతోంది. గతంలో మూడు శాఖలకు సంబంధించిన అధికారులు ఒక్కొక్కరు ఒక్కోసారి పరిశీలనకు వెళ్లేవారు. ప్రస్తుతం మూడు శాఖల అధికారుల ఒకేసారి వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది. లేఅవుట్లు, ప్లాట్లు శిఖం భూమిలో లేనట్లు నీటిపారుదలశాఖ అధికారులు ఇచ్చే ఎన్‌ఓసీ (నిరభ్యంతర పత్రం) జారీలో జాప్యం జరుగుతోందని యంత్రాంగం చెబుతోంది. అందుకే దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది.

ఆసక్తి చూపని దరఖాస్తుదారులు

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనకు దరఖాస్తుదారులెవరూ ఆసక్తి చూపటం లేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. దీనికి తోడు ఎల్‌ఆర్‌ఎస్ యాప్ మొరాయిస్తుండటం కూడా భద్రాద్రి జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ వేగంగా సాగకపోవటానికి కారణమంటున్నారు. దరఖాస్తు సమయంలో ధ్రువపత్రాలు సరిగ్గా సమర్పించని దరఖాస్తుదారులకు ఉన్నతాధికారుల ఆదేశాలతో మరోసారి అవకాశం ఇచ్చామని తెలిపారు. రోజుకు 20 మంది దరఖాస్తుదారులకు సమాచారమిస్తే కేవలం ఒకరిద్దరు మాత్రమే లేఅవుట్, ప్లాట్ పరిశీలనకు వస్తున్నారని చెబుతున్నారు.

"పాల్వంచ పురపాలిక పరిధిలోనే అత్యధికంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 2,500కుపైగా దరఖాస్తులకు సరైన ధ్రువపత్రాలు లేకపోవటంతో దరఖాస్తుదారులకు మరోసారి అవకాశం కల్పించాం. దరఖాస్తుల ప్రక్రియను సకాలంలో పూర్తిచేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నప్పటికీ దరఖాస్తుదారుల నుంచి స్పందన రావటం లేదు."
- ధాకునాయక్, పుర కమిషనర్, పాల్వంచ



సింగరేణిలో

కాగిత రహిత సేవలకు శ్రీకారం

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

పర్యావరణ హితానికి సింగరేణి పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఉపరితల గనుల కోసం అడవులను తొలగిస్తూ, భూగర్భంలో ఉత్పత్తిని వెలికితీస్తూ అనివార్యంగా పర్యావరణ సమతుల్యాన్ని దెబ్బతీస్తున్న ఆ సంస్థ.. మరోవైపు సాధ్యమైనంత మేర పచ్చదనం పెంపు, కాలుష్య నివారణ చర్యలు చేపడుతోంది. మురుగు నీటిశుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేసింది. పర్యావరణ హిత చర్యల్లో భాగంగా 'కాగిత రహిత సేవలకు' తాజాగా నాంది పలికింది. ఇందులో భాగంగా శ్రీఇంక్లైన్‌లో ఏర్పాటైన ఏరియా జీఎం కార్యాలయంలో తొలిసారిగా ఈ 'సేవలను ప్రవేశపెట్టేందుకు నిర్ణయించింది. ప్రత్యేకంగా 'శాప్' తదితర సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధిపరుస్తున్న యాజమాన్యం ఉద్యోగులకు శిక్షణ ఇస్తోంది.



నూతనంగా ఏర్పాటైన జీఎం కార్యాలయం

ఏయే సేవలు?

- ★ కార్యాలయానికి వచ్చే ఉత్తర్వులు, సర్క్యులర్లు, నోట్‌ఫైల్స్
- ★ ఇక్కడి నుంచి ఇతర కార్యాలయాలు, అధికారులకు వెళ్లే ప్రతిపాదనలు, అభ్యర్థనలు
- ★ వివిధ విభాగాలకు ఇక్కడే కాగితపు ఫైల్స్ రావు. టేబుళ్లపై దస్త్రాలు కనిపించవు. కేవలం ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతాయి.
- ★ ఇందుకోసం అధికారులు, సిబ్బంది తహసీల్దార్ తరహాలో డిజిటల్ సంతకాలు వాడతారు.

మొదటి కార్యాలయం ఇదే..

కొత్తగూడెంలో రూ.2 కోట్లతో కొత్తగా ఏరియా జీఎం కార్యాలయం నిర్మించారు. ఏరియా పరిధిలోని అన్ని విభాగాలు, గనులు దీనికి అనుసంధానమై ఉంటాయి. ఎలాంటి సమాచార లోపం లేకుండా పనులు కొనసాగేలా ఉద్దేశంతో డిజిటలైజ్ కార్యాలయంగా తీర్చిదిద్దుతున్నారు. ఉద్యోగుల హాజరు నుంచి జీఎం స్థాయి అధికారి వరకు జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ఇక ఆన్‌లైన్‌లోనే. కాగితం ముక్కతో పని లేకుండా నిర్వహిస్తారు. దీంతో ఎక్కడేం జరుగుతుందో జీఎం కార్యాలయం నుంచి క్షణాల్లో పర్యవేక్షించే వెసులుబాటు ఉంటుంది. సమాచార జాప్యం, లోపం వంటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు మున్సిపల్, రెవెన్యూ కార్యాలయాల్లో ఈ విధానాన్ని ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తోంది. సింగరేణిలో మాత్రం ఈ ఘనతను ఏరియా జీఎం కార్యాలయం తొలిసారి దక్కించుకోనుంది. మరి కొద్ది రోజుల్లోనే ఈ కార్యాలయం అందుబాటులోకి రానుంది.

'మారుతున్న కాలంతో పాటు సింగరేణిలోనూ కాగిత రహిత సేవలు, డిజిటలైజ్ కార్యాలయాల్ని అందుబాటులోకి తేనున్నారు. సంస్థ సీఎండీ బలరాం, డైరెక్టర్లు ఈ విషయంలో పట్టుదలతో ఉన్నారు. కొత్త కార్యాలయంలోని టేబుల్స్‌పై కుప్పలుగా ఫైళ్లు పేరుకుపోయే పరిస్థితి, సిబ్బంది హడావుడి వంటివి కనిపించవు. డిజిటలీకరణతో పనుల్లో వేగం పుంజుకోనుంది' అని ఏరియా జీఎం షాలేమురాజు 'న్యూస్‌టుడే'తో అన్నారు.

గన్యా నొప్పులు.. బాధితుల తిప్పలు

➥ వైరా నియోజకవర్గంలోని ఓ గ్రామానికి చెందిన రైతు రామారావుకు ఇటీవల జ్వరం వచ్చి తగ్గిపోయింది. ఆరోగ్యం కుదుటపడే సమయంలో కాళ్లు, చేతులు, కీళ్లలో నొప్పులు మొదలయ్యాయి. ఖమ్మం సర్వజనాసుపత్రి వైద్యులను సంప్రదించగా గన్యా సోకినట్లు నిర్ధారించారు. బాధితుడు పని చేయలేక మంచంపట్టి నెల రోజుల పాటు ఒంటి నొప్పులతో బాధపడ్డారు.




ఓపీ వద్ద జ్వర పీడితులు

➥ చింతకాని మండలానికి చెందిన భద్రమ్మ అకస్మాత్తుగా అలసటకు గురైంది. జ్వరం, తలనొప్పి, నీరసం తదితర సమస్యలతో బాధపడింది. ఆస్పత్రి వైద్యులను కలిసిన తర్వాత చికిత్స అందించారు. జ్వరం తగ్గిపోయి మళ్లీ వచ్చింది. రెండోసారి మూడు రోజుల్లో కోలుకుంది. ఆ తర్వాత ఒళ్లు నొప్పులు ప్రారంభమయ్యాయి. నొప్పులు భరించలేక కాలు కదపలేని స్థితిలో వైద్యులను సంప్రదించింది.

ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే

సాధారణ జ్వరంలా ప్రారంభమై తీవ్రమైన కీళ్ల నొప్పులు వస్తున్నాయి. వైద్య పరీక్షలు చేయించుకుంటే ఏమీ లేదని రిపోర్టు వస్తుంది. ఒంటిపై దద్దుర్లు, నీరసం, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. వారం తర్వాత జ్వరం తగ్గుముఖం పడుతోంది. కానీ నెలరోజులకు మళ్లీ కీళ్లనొప్పులు మొదలవుతున్నాయి. పాదాలు, చీలమండలు, మోకాళ్లు, చేతి వేళ్ల నొప్పులు వస్తున్నాయి. వైద్యులను సంప్రదిస్తే వైరల్ జ్వరాలని చెబుతున్నారు. ఇదీ జిల్లాలో నెలకొన్న పరిస్థితి. గన్యా, ఆల్ఫా, హెపటైటిస్-బి, సీ, పార్వో వంటి వైరస్‌లు తీవ్రమైన కీళ్ల నొప్పులకు దారి తీస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. వారం నుంచి నెలపాటు నొప్పులు బాధిస్తున్నాయి. తనవద్దకు వచ్చే ప్రతి ఇద్దరు బాధితుల్లో ఒకరు ఇదే సమస్యతో వస్తున్నారని ఓ ప్రముఖ వైద్యుడు చెప్పడం గమనార్హం. మూడు వారాల నుంచి నెలకు పైగా బాధపడుతున్నవారు ఉన్నారు. బాధితుల్లో శక్తి తగ్గిపోవడం, అలసట, తల నొప్పి లక్షణాలు కనిపిస్తున్నాయి. నొప్పులతో రోజువారీ కార్యాల్లో ఆటంకం ఏర్పడుతోందని బాధితులు వాపోతున్నారు. నిర్ధారణ పరీక్షల్లో గన్యా పాజిటివ్‌లు అంతగా ఉండటం లేదు. వైద్యులు వైరల్ జ్వరాల వల్ల నొప్పులు ఉంటున్నాయని అని అంటున్నారు. దోమకాటు వైరస్ కారణమని చెబుతున్నారు.



దోమకాటు వ్యాధులు ఇలా (జనవరి నుంచి ఇప్పటి వరకు)..

- పరీక్షలు- 28260
- డెంగీ- 513
- పరీక్షలు- 4486
- చికున్ గన్యా- 15
- పరీక్షలు- 91220
- మలేరియా- 0

వైరల్ జ్వరాలకు సరైన ఔషధాలు లేవు

డాక్టర్ రాజీవ్
జనరల్ మెడిసిన్(హెచ్ఓడీ)



జ్వర లక్షణాలతో ఎక్కువ మంది ఆస్పత్రికి వస్తున్నారు. వైరస్ కారణంగా బాధితులకు కీళ్లు, ఒళ్లు నొప్పులు ఉంటున్నాయి. ఎలాంటి భయం అవసరం లేదు. నెల రోజుల్లో నొప్పులు తగ్గిపోతాయి. దోమకాటు వల్ల గన్యా జ్వరం సోకుతుంది. పీసీఆర్ పరీక్షలతో వ్యాధిని నిర్ధారించవచ్చు. సర్వజనాసుపత్రిలో పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి నిర్మూలనకు స్పష్టమైన యాంటీబయాటిక్స్ లేవు. నిరంతర వైద్య పర్యవేక్షణే ముఖ్యం. విశ్రాంతి తీసుకుంటూ లక్షణాల ఆధారంగా మందులు వాడాలి. ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజాల సమతుల ఆహారం తీసుకోవాలి. ఆహారం తినలేక ఇబ్బంది పడితే ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.

రాములోరికి అభిషేక మహోత్సవం


భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయం పరిసరాలు ఆదివారం కిక్కిరిసిపోయాయి. మూలవిరాట్‌కు అర్చకులు సుప్రభాతం పలికి ఆరాధించి నామార్చన చేశారు. అభిషేక మహోత్సవం కనులకు పండుగ చేసింది. ఈ వేడుక సాగుతున్నంతసేపు జైశ్రీరాం అంటూ భక్తులు నీరాజనాలు పలికారు. బంగారు పుష్పార్చన అలరించింది. భద్రాద్రి దర్శనం పరమ పావనమని సుభాషించారు. గోత్ర నామాలను చదివారు. కల్యాణ క్రతువు గురించి వివరిస్తు సీతమ్మకు యోక్త్రధారణ రామయ్యకు యజ్ఞోపవీత ధారణ కొనసాగించారు. మాంగల్య ధారణ తన్మయత్వంలో నింపగా తలంబ్రాల వేడుక భక్తిభావాలను పంచింది. భక్తులు ప్రధాన ఆలయంతో పాటు అనుబంధంగా ఉన్న ఆంజనేయుణ్ని లక్ష్మీతాయారు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సోమవారం ముత్తంగి రూపంలో రాముల వారి దర్శనం ఉంటుందని వైదిక పెద్దలు తెలిపారు.



భద్రాద్రి డీహెచ్ఎస్ఓగా శ్రీనివాసరావు

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారిగా ఆర్.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన కరీంనగర్ జిల్లా డీహెచ్ఎస్ఓగా పని చేస్తున్నారు. గతంలో భద్రాద్రి జిల్లా అధికారిగా పని చేసిన సూర్యనారాయణ ఏసీబీకి చిక్కి సస్పెండ్ కావడంతో ఆయన స్థానంలో శ్రీనివాసరావును రాష్ట్ర సంచాలకుడు బదిలీ చేశారు. గతంలో ఈయన ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారిగా పని చేశారు. కామారెడ్డి జిల్లా అధికారిగా పని చేస్తున్న పి.కమలాకర్‌రెడ్డిని శ్రీనివాసరావు స్థానంలో కరీంనగర్ జిల్లా అధికారిగా నియమించారు. రాష్ట్రంలోనే ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం అధికంగా ఉండటం, అలాగే రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన, సహకార, మార్కెటింగ్, చేనేతశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సొంత జిల్లా కావటంతో జిల్లా అధికారి పోస్టును వెంటనే భర్తీ చేశారు.

వేళ్లూనుకున్న నిర్లక్ష్యం



రెండేళ్ల క్రితం హరితహారంలో భాగంగా కొనుగోలు చేసిన వివిధ రకాల మొక్కలను మధిర మున్సిపాలిటీ నర్సరీలోనే ఉంచారు. రూ.వేలు వెచ్చించి కొనుగోలు చేసిన బాదం, ఇతర రకాల మొక్కలను వీధుల వెంట నాటకుండా, ఇళ్లలో పంపిణీ చేయకుండా అలాగే వదిలేశారు. పాలిథిన్ సంచుల్లోనే ఉండిపోయిన ఆ మొక్కల వేళ్లు భూమిలోకి పాతుకుపోయాయి. మొక్కలు చెట్లుగా మారటంతో వాటిని పెకిలించే పరిస్థితీ లేదు. పర్యావరణ ఇంజినీరు సైదానాయక్ మాట్లాడుతూ రెండేళ్ల క్రితం తెచ్చిన మొక్కలు వినియోగించకపోవడంతో వాటి వేళ్లు పాతుకుపోయాయని, అందుకే వన మహోత్సవంలో వినియోగించుకోలేకపోయామన్నారు. – మధిర, న్యూస్‌టుడే

అచ్చం పక్షుల్లానే..!



ఈ చిత్రంలో నిజమైన పక్షుల్ని పోలిన ఇవి బొమ్మ పక్షులు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కిన్నెరసాని పర్యావరణ విద్యా కేంద్రంలో ఏర్పాటు చేసి ప్రతిమలు ఇవి.. అచ్చం నిజం పక్షులను పోలి ఉండటంతో చూపరులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ బొమ్మలు తయారు చేసిన శిల్పిని ప్రశంసించకుండా ఉండలేకపోతున్నారు.
- పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే

అరచేతిలో

ఓటరు జాబితా..!

తెలంగాణలో త్వరలో పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీల్లోని వార్డుల వారీగా తుది ఓటరు జాబితాను సిద్ధం చేసింది. దీనికోసం సెప్టెంబర్ 13న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి, అభ్యంతరాలను స్వీకరించింది. సెప్టెంబర్ 28న తుది జాబితా విడుదలైంది. ఆ జాబితాను సామాన్యులకు సైతం అందుబాటులో ఉంచేలా వెబ్‌సైట్లో పొందుపర్చారు. అందులో మీ పేరుందో? లేదో? తెలుసుకోవడంతోపాటు, పంచాయతీ, వార్డుల వారీగా బాబితాను చూసి, డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇందుకోసం మీరు గూగుల్‌లోకి వెళ్లి tsec.gov.in వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి. అందులోకి వెళ్లగానే టీఎస్ఈసీ వెబ్‌సైట్‌తోపాటు, ఫైనల్ రోల్స్ జీపీ, వార్డు వైజ్ ఓటరు లిస్ట్ యాజ్ ఆన్ 28.09.2024 అనే మరో ఆప్షన్ కనిపిస్తాయి. రెండో ఆప్షన్‌ను ఎన్నుకొని అక్కడ మీ జిల్లా, మండలం, గ్రామ పంచాయతీ వివరాలు నమోదు చేయగానే మీ గ్రామానికి సంబంధించిన ఓటరు జాబితా వార్డుల వారీగా క్షణాల్లో ప్రత్యక్షమవుతుంది. ఓటరు జాబితా తెలుగు, ఆంగ్ల భాషల్లో అందుబాటులో ఉంటుంది. అవసరమైతే భద్రపరచుకోవచ్చు.



tsec.gov.in ఓపెన్ చేయగానే కనిపించే రెండు ఆప్షన్లు ఇలా..



రెండో ఆప్షన్‌పై క్లిక్ చేసి, వివరాలు నమోదు చేయగానే ప్రత్యక్షమైన వార్డుల వారీ వివరాలు

- అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, న్యూస్‌టుడే

రాష్ట్ర జూనియర్ బాలికల

బాల్‌బ్యాడ్మింటన్ ఛాంపియన్ ఖమ్మం

బోనకల్లు, న్యూస్‌టుడే: రాష్ట్ర 69వ జూనియర్ బాలికల బాల్‌బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌ను ఖమ్మం జిల్లా జట్టు కైవసం చేసుకుంది. ఈ నెల 4 నుంచి 6 వరకు కామారెడ్డిలో నిర్వహించిన పోటీల్లో వరుసగా అయిదోసారి రాష్ట్ర ఛాంపియన్‌షిప్‌ను ఖమ్మం జట్టు కైవసం చేసుకుంది. జట్టులో పది మంది క్రీడాకారులుండగా వారిలో 8మంది బోనకల్లు వారే కావటం విశేషం. జట్టు విజయంపై జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్, కార్యదర్శి శ్రీనివాసరావు, కోచ్ అమిరేశి లింగయ్య, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పద్మావతి హర్షం వ్యక్తం చేశారు.



ఛాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకుంటున్న ఖమ్మం జిల్లా జట్టు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఈనాడు కథనానికి స్పందన

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: మూత్రపిండ వ్యాధితో ఇబ్బంది పడుతున్న కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. జల్లేపల్లికి చెందిన దారా మన్సూర్, రమణ దంపతులు మూత్రపిండ వ్యాధితో బాధపడుతున్న విషయమై గత నెల 30న 'ఈనాడు'లో 'మాయదారి రోగం... పేద బతుకు ఆగం' శీర్షికన కథనం ప్రచురితమైంది. జింకలగూడేనికి చెందిన 'హాజీ సయ్యద్ మదార్‌సాబ్' ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ మహ్మద్ ఇమాం బాధిత కుటుంబానికి ఆదివారం రూ.20 వేలు అందించారు. మన్సూర్ ఇద్దరు కుమార్తెల చదువుకు అయ్యే ఖర్చును కూడా తాను అందించేందుకు సిద్ధమని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జల్లేపల్లి గ్రామపెద్దలు జగదీశ్, శ్రీను, కృష్ణారావు, వీరన్న, మదార్, సైదా తదితరులు పాల్గొన్నారు.



మన్సూర్‌కు నగదు అందిస్తున్న ఇమాం తదితరులు

కాటేసిన కరెంటు.. ఇద్దరి దుర్మరణం

పూలు కోస్తు ఒకరు.. పంకా వేస్తూ మరొకరు

విద్యుత్తు వైర్లు ఇదరు బాలల ప్రాణాలు బలి తీసుకున్నాయి. బతుకమ్మ పూలు కోస్తుండగా చెట్టుకు వైర్లు తగిలి పదో తరగతి బాలుడు, పంకా స్విచ్ వేస్తుండగా విద్యుదుదాఘాతంలో ఐదో తరగతి బాలిక అసువులుబాసారు.



చరణ్‌తేజ్

ఖానాపురం హవేలి: 11 కేవీ విద్యుత్తు వైర్లు చెట్టుకు తగిలి విద్యుదాఘాతంతో పదో తరగతి విద్యార్థి చనిపోయిన సంఘటన రఘునాథపాలెం మండలం పాపటపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. రెండు పడక గదుల ఇళ్ల సముదాయంలోని ఓ ఇంట్లో నివసిస్తున్న మిట్టపల్లి వెంకన్న, ఉపేంద్రమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు చరణ్‌తేజ్(16) ఉన్నారు. చరణ్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఉదయం 8 గంటల సమయంలో బతుకమ్మ పూలు కోసేందుకు పక్కింటి మిద్దెపైకి వెళ్లాడు. టేకు చెట్టుకు పూలు కోస్తుండగా.. పక్కనే ఉన్న 11 కె.వి. విద్యుత్ తీగలు కొమ్మకు తగిలి బాలుడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్ర గాయాలతో ప్రాణాలు వదిలి.. కింద పడిపోయాడు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు మృతదేహం వద్ద గుండెలవిసేలా రోదించడం చూపరులను కంటతడి పెట్టించింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

పంకా వేస్తూ బాలిక..: గుండాల, న్యూస్‌టుడే: గుండాల మండలం వెన్నెలబైలుకు చెందిన ఇర్ప స్వప్న(12) ఆదివారం రాత్రి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. తండ్రి కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం. . ఫ్యాను వేస్తున్న సందర్భంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైంది. గమనించి తీగలను తొలగించినప్పటికీ స్పృహ కోల్పోయింది. 108 వాహనంలో గుండాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యాధికారి మనీష్‌రెడ్డి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎస్సై రాజమౌళి కేసు నమోదు చేశారు. స్వప్న స్థానిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు..

కొణిజర్ల: తాటిచెట్టుపై నుంచి జారిపడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన సింగరాయపాలెంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన సురభి బాబు(53) అనే గీత కార్మికుడు తాటి చెట్టు కొమ్మలు(మట్టలు) కోసేందుకు ఎక్కి ప్రమాదవశాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జ్వరంతో గిరిజన మహిళ...

చర్ల, న్యూస్‌టుడే: ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఎదిర గ్రామానికి చెందిన కణితి గంగోత్రి(22) ఆదివారం జ్వరంతో మృతి చెందింది. మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆమెకు కుటుంబ సభ్యులు చర్లలోని గ్రామీణ వైద్యుడి వద్ద చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ గంగోత్రి మృతి చెందింది.

అప్పుల బాధతో ఆత్మహత్య..?

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన అశ్వారావుపేట మండలంలో చోటుచేసుకుంది. పోలీసు కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడానికి చెందిన రామిశెట్టి నాగేశ్వరరావు(60) ఇటీవల తన తమ్ముడి గ్రామమైన అశ్వారావుపేట మండలం ఊట్లపల్లికి వచ్చాడు. తమ్ముడితో ఈనెల 5న జంగారెడ్డిగూడెం వెళుతున్నానని చెప్పి మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గ్రామ సమీపంలోని రాఘవయ్య చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. అప్పుల బాధ తాళలేకనే చనిపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఈమేరకు ఎస్ఐ యయాతి రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరి జీవితాన్ని భరించలేక వ్యక్తి...

జూలూరుపాడు: జూలూరుపాడు ఉన్నత పాఠశాలలోని తరగతి గది వరండాలో ఓ వ్యక్తి పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జూలూరుపాడు మండలం పాపకొల్లుకు చెందిన పావురాల వెంకటేశ్వర్లు(50) భార్య 2012లో మృతి చెందింది. అప్పటి నుంచి ఆయన తన సోదరుడి కుమారుడి వద్ద ఉంటున్నాడు. ఈ నేపథ్యంలోనే పలుమార్లు తన ఒంటరి జీవితాన్ని గుర్తు చేసుకుంటూ చనిపోవాలని ఉందని వాపోతుండేవాడు. శనివారం కొత్తగూడెంలోని తన సోదరుడి వద్దకు వెళ్తున్నట్లు ఇంటి నుంచి బయలు దేరి తిరిగి రాలేదు. మరుసటి రోజు ఉదయం జూలూరుపాడు ఉన్నత పాఠశాలలోని వరండాలో మృతి చెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న ఎస్సై రాణాప్రతాప్ వివరాలు సేకరించారు. పురుగు మందు తాగినట్లు గుర్తించారు. మృతుడి సోదరుడు మహేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

చిరుప్రాయం.. మొక్కలే నేస్తం

చిన్నారి

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

చిన్న వయసులోనే మొక్కలపై ప్రేమ పెంచుకున్నారు. పర్యావరణ పరిరక్షణకు మేము సైతం అని ముందుకు సాగుతున్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించి ఎంతోమంది తోటి పిల్లలకే కాదు పెద్దలకు సైతం స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. కొత్తగూడేనికి చెందిన విశ్వామిత్ర చౌహాన్, సాత్విక్‌లపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం...

పర్యావరణ మిత్రుడు

చుంచుపల్లి మండలం హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన జయరాం నాయక్, అనూష దంపతుల కుమారుడు విశ్వామిత్ర చౌహాన్(5). స్థానికులు పర్యావరణ 'మిత్ర'గా పిలుచుకుంటారు. పద్మశ్రీ వనజీవి రామయ్య దంపతులు తమ వారసుడని చెప్పుకున్నారంటే ఇతనికి మొక్కలంటే ఎంత ఇష్టమో ఇట్టే తెలిసిపోతుంది. నవ భారత్ పాఠశాలలో యూకేజీ చదువుతున్న బుడతడు రెండేళ్ల వయసు నుంచే మొక్కలపై ఆసక్తి చూపేవాడని తల్లిదండ్రులు చెబుతారు. ఇంటితోపాటు ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాలు, పాఠశాలల్లో మొక్కలు నాటి నాటి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నుంచి ప్రశంసలు అందుకున్నాడు. మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు, కలెక్టర్లతో కలిసి మొక్కలు నాటాడు. తాను నాటిన మొక్కలకు లెక్కలు లేకపోయినా అనేక మంది ప్రముఖులతో ప్రశంసా పత్రాలు అందుకున్నాడు. తాజాగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌తో కలిసి మొక్క నాటి ప్రశంసలు అందుకున్నాడు.



కేసీఆర్ అభినందనలు అందుకుంటున్న విశ్వామిత్ర



మొక్క నాటుతున్న సాత్విక్

మొక్కలు పెంచడం వ్యాపకం

పట్టణానికి చెందిన సాత్విక్ మొక్కలు పెంచడం వ్యాపకంగా మార్చుకున్నాడు. ఇంట్లో పూల కుండీల దగ్గరి నుంచి ఖాళీ స్థలం కన్పిస్తే మొక్కలు నాటడం అలవాటు. తానే మొక్కలకు నీరు పోసి పరిరక్షిస్తుంటాడు. సింగరేణి పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ఇతను రెండేళ్ల కిందటి నుంచి మొక్కలు నాటడం ప్రారంభించాడు. హరితహారం కార్యక్రమం విశిష్టతపై పాఠశాలలో ఉపాధ్యాయుల బోధనలకు ఆకర్షితుడై మొక్కలు నాటుతున్నాడు. పూల, పండ్ల రకాలు నాటి సంరక్షిస్తున్నాడు. పాఠశాలలో ఇటీవల జరిగిన 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో సైతం పాల్గొని ప్రశంసలు పొందాడు.

సత్తుపల్లి

•సత్తుపల్లి •మధిర •వైరా

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కొణిజర్ల, న్యూస్‌టుడే: పల్లిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 2003-04లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఒకే వేదికపైకి చేరుకుని నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాటి గురువులు రంగాచార్యులు, దయాకర్‌రావు, రాములమ్మ, కృష్ణవేణి, శ్రీనివాసరావు, ప్రమీలను ఘనంగా సత్కరించారు.

అమరవీరులకు నివాళి

ముదిగొండ, న్యూస్‌టుడే: ముదిగొండలోని భూపోరాట అమరవీరుల స్తూపం వద్ద కేరళ రాష్ట్రానికి చెందిన ఎన్‌జీఓ రాష్ట్ర నాయకుడు జితేశ్, సీపీఎం నాయకులు ఆదివారం నివాళులర్పించారు. కాల్పుల ఘటన వివరాలడిగి తెలుసుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంపై డాక్యుమెంటరీ రూపకల్పన కోసం వచ్చినట్లు జితేశ్ వివరించారు. సీపీఎం నాయకులు రమేశ్, వరప్రసాద్, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, సీపీఎం మండల కార్యదర్శి పురుషోత్తం పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) సత్తుపల్లి : 93922 39905 మధిర : 98668 05652 వైరా : 76619 46938

మినీ స్టేడియం ఎదుట పది రోజులుగా మిషన్ భగీరథ నీరు లీకై వృథాగా పోతుందంటూ 'మేమున్నాం మీకు తోడుగా'లో అక్టోబరు 5న కథనం ప్రచురితమైంది. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్ తమ సిబ్బంది సాయంతో లీకైన ప్రాంతంలో కొత్త పైపును అమర్చి సమస్య పరిష్కరించారు.

స్పందనకు వందనం

– కల్లూరు, న్యూస్‌టుడే

బాధిత కుటుంబానికి సాయం

కల్లూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని అంబేడ్కర్ నగర్‌లో జ్ఞానేశ్ అనే వ్యక్తి ఇల్లు గత బుధవారం అగ్నికి ఆహుతైంది. అంబేడ్కర్ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం బాధిత కుటుంబానికి రూ. 32 వేలు అందించారు.



ఆర్థిక సాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఫొటోగ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో..

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లిలో ఇటీవల మృతి చెందిన మెట్రో స్టూడియో నిర్వాహకుడు పసల రాము కుటుంబాన్ని ఫొటోగ్రాఫర్స్ యూనియన్ రాష్ట్ర, జిల్లా బాధ్యులు ఆదివారం పరామర్శించారు. సత్తుపల్లి యూనియన్ నుంచి రూ. 17,500, జిల్లా యూనియన్ నుంచి రూ. 10వేలు మొత్తం రూ. 27,500 బాధిత కుటుంబానికి అందజేశారు. సుమాంజలి రాము, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సాగర్, తిరుమలరావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి..: కొణిజర్ల, న్యూస్‌టుడే: దుద్దెపుడికి చెందిన వైద్య విద్యార్థిని హర్షితకు విద్యా ఖర్చుల నిమిత్తం దాతలు చేయూత అందించారు. ఖమ్మం లయన్స్ క్లబ్ సభ్యుడు కృష్ణారెడ్డి చొరవతో క్లబ్ నుంచి రూ. 20 వేలు, వాసవీ కన్యకాపరమేశ్వరి ట్రస్టు నుంచి రూ. 11 వేలు రూ. 31 వేలను ఆదివారం అందించారు. మాజీ సర్పంచి కొత్తా వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్ వాసవి పాల్గొన్నారు.

రాగితీగ.. దొంగలపాలు



సత్తుపల్లి డివిజన్‌లో బెంబేలెత్తిస్తున్న చోరులు

వేంసూరు, పెనుబల్లి, న్యూస్‌టుడే

పంట పొలంలో చిన్నపాటి ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసంచేసి రాగితీగ అపహరించుకెళ్లారంటే 'జనసమర్థంలేని ప్రాంతం కదా..! చోరీకి ఆస్కారం ఉండొచ్చు' అని భావిస్తాం. గట్టిగా బస్తాలో చుట్టుకుని, గట్టునపడి వెళ్తే ఎవరు మాత్రం గుర్తిస్తారు? అని ఆలోచిస్తాం. కానీ కొన్ని రోజులుగా సత్తుపల్లి డివిజన్‌లో చోటుచేసుకుంటున్న ఘటనల తీరును పరిశీలిస్తే 'ఈ చోరులు ఆకాశం నుంచి జారిపడి క్షణాల్లో రాగితీగ అపహరించి అంతర్థానం అవుతున్నారా..' అన్న అనుమానం రాకమానదు. వారు చిత్తుచేస్తున్న చోరీ సొత్తు ఇద్దరు ముగ్గురితో అయ్యేది కాదు. బస్తాలో మూట చుట్టి గుట్టుగా తీసుకెళ్లే పరిమాణమూ కాదు. యంత్ర సాయం లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసే ఆస్కారం లేదు. వాహనాలు రాకుండా తీసుకెళ్లే అవకాశమూ ఉండదు. భారీ చోరీలను చూసి రైతులతోపాటు విస్తుపోవటం తప్ప అధికారులు ఏమీ చేయలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పంట పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి విలువైన రాగితీగలు తస్కరించే ముఠాలు సత్తుపల్లి డివిజన్‌లో ఆందోళన కలిగిస్తున్నాయి. మే నెలలో కొన్ని రోజులపాటు సాగిన చోరీల పర్వం మళ్లీ మొదలైంది. కొద్ది రోజులుగా వేంసూరు, కల్లూరు మండలాల్లో భారీ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగితీగను అపహరిస్తున్నారు. ఎత్తిపోతల పథకాలను ప్రధాన లక్ష్యంగా చేసుకుంటున్నారు. పొలాల్లో మోటార్ల కోసం ఏర్పాటుచేసిన 60కేవీ సామర్థ్యం మొదలు ఎత్తిపోతలకు సంబంధించి 630 కేవీ సామర్థ్యంగల పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ల వరకు వేటినీ వదలడం లేదు. రాగితీగ, కోరు, ఇంధనం సహా ఎత్తుకపోతున్నారు. ఆదినుంచీ కేసులు నమోదవుతున్నా పెద్ద ముఠాల ఆచూకీ కనిపెట్టడంలో పోలీసులు విఫలమవుతున్నారు.

రాగితీగ అపహరణకు గురైన వేంసూరు ఎత్తిపోతలకు సంబంధించిన 630 కేవీ ట్రాన్స్‌ఫార్మరు

ఎలా సాధ్యమైంది?

వేంసూరు 1, 2, గూడూరు ఎత్తిపోతల పథకాల ద్వారా 6వేల ఆయకట్టు సాగవుతుంది. ఈ భారీ ఎత్తిపోతలకు 350 హెచ్‌పీ మోటార్ల కోసం 630కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. వారం క్రితం ఒకే రోజు 630కేవీ నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు, 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి రాగితీగ దొంగిలించారు. రూ.కోటికి పైగా నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. భారీ పరిమాణం ఉన్న వాటిని గంటల వ్యవధిలో పగులగొట్టడం లేదా విప్పదీయటం, తీగలను వేరుచేయటం అంత సులువుకాదు. నిందితులు భారీ పరికరాలు, ట్రక్కులతో సహా వచ్చివాలుతున్నట్టు అధికారులు అనుమానిస్తున్నారు కానీ ఆచూకీ గుర్తించలేకపోతున్నారు. ప్రస్తుత మార్కెట్‌లో భారీ ట్రాన్స్‌ఫార్మరు ఖరీదు రూ. 20 లక్షలు.

★ కల్లూరు మండలంలో ఈ ఏడాది మేలో బత్తులపల్లి ఎత్తిపోతల పథకం వద్ద 400 కేవీ ట్రాన్స్‌ఫార్మరు, ఈ నెల 4న ఖాన్‌ఖాన్‌పేట వద్ద 100 కేవీ ట్రాన్స్‌ఫార్మరు ధ్వంసం చేసి రాగితీగ అపహరించారు.

మచ్చుకు కొన్ని..

★ పెనుబల్లి మండలం రాతోని, తాళ్లపెంట వద్ద 'ఎత్తిపోతల' ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి రాగితీగ చోరీ చేశారు. దీంతో రైతులకు పంట నష్టం, ప్రభుత్వానికి రూ. కోట్లలో నష్టం వాటిల్లింది.

ఎందుకిలా?

1 వర్షాలు సమృద్ధిగా కురవటం, సాగర్ జలాలుండటంతో రైతులు మోటార్లు, లిఫ్టుల వైపు తిరిగి చూసే అవసరం ఉండటం లేదు. మనుష్య సంచారం అంతగాలేని ప్రస్తుత పరిస్థితులనూ దొంగలు అవకాశంగా తీసుకుంటున్నారు. పంట కోతలు పూర్తయ్యే మే నెలలో అయితే మరింత సులువుగా చోరీలకు పాల్పడుతున్నారు.

2 విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువగా నిర్మానుష్య ప్రదేశాల్లోనే ఉంటున్నాయి.

15వేల ఎకరాల ఆయకట్టు

ఎత్తిపోతలకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లలో తీగ చోరీకి గురైతే పథకాలు మూలన పడుతున్నాయి. పునరుద్ధరణలో జాప్యం జరుగుతుండటంతో అన్నదాతలు పంట నష్ట పోతున్నారు. యాసంగి పంటలను కాపాడుకునేందుకు ఎత్తిపోతలే ప్రధాన ఆధారం. సత్తుపల్లి డివిజన్‌లోని అయిదు మండలాల్లో ఎత్తిపోతల పరిధిలో 15వేల ఎకరాల ఆయకట్టు ఉంది.

'రాగితీగ అపహరణకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు జలవనరుల శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు పంపాం. పంట నష్టం లేకుండా త్వరలోనే పనులు పూర్తి చేస్తాం. రైతులు కూడా ప్రతి రోజు గమనిస్తూ ఉండాలి.'

- జలవనరుల శాఖ డీఈఈ మరియన్న, ఐడీసీ డీఈఈ నాగేశ్వరరావు

తీగల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు పట్టణ, మండల పరిధిలో విద్యుత్తు స్తంభాలకు పిచ్చితీగలు అల్లుకున్న విషయమై 'ప్రమాదం అల్లుకుంది' శీర్షికన ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఏఈలు గణేశ్, తిరుపతయ్యలు తమ సిబ్బంది సాయంతో తీగలను తొలగించి పరిస్థితి చక్కదిద్దారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి పెనుబల్లి మండలం వి.ఎం.బంజరకు చెందిన మిట్టపల్లి బాలాజీ రూ.లక్ష విరాళాన్ని ఆదివారం అందజేశారు. దాతను ఆలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం అభినందించి స్వామివారి ప్రసాదాలు, నిత్యాన్నదాన పత్రాలు అందజేశారు.

చిన్నారికి ఆర్థిక సాయం

బోనకల్లు: గుండెకు రంధ్రంపడి శస్త్రచికిత్స చేయించుకున్న ఆళ్లపాడు గ్రామానికి చెందిన పోదిలం రోహిత్‌కు ఎన్‌ఆర్ఐ బాగం రాకేశ్ ఆదివారం రూ. 10వేలు వితరణగా అందజేశారు.

గుండెపోటుతో యువకుడు మృతి



ప్రేమ్‌చంద్

కారేపల్లి, న్యూస్‌టుడే: గుండెపోటుతో యువకుడు మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సూర్యాతండాకు చెందిన బానోతు ప్రేమ్‌చంద్(32) తన మరదలు పెళ్లి విషయం మాట్లాడేందుకు ఈ నెల 5న అత్తగారి ఊరైన టేకులపల్లి మండలం ముత్యాలగూడెం వెళ్లారు. అనంతరం ఇంటికి బయల్దేరుతుండగా మరుసటి రోజు వెళ్లమని అత్తింటివారు కోరడంతో అక్కడే ఉన్నారు. అదే రోజు అర్ధరాత్రి గుండెపోటుతో నిద్రలోనే మరణించాడు. ఆదివారం ఉదయం విషయం గుర్తించారు. ప్రేమ్‌చంద్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

పెనుబల్లి, న్యూస్‌టుడే: లంకాసాగర్ క్రాస్ రోడ్డు వద్ద కారు అదుపుతప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రామచంద్రారావు బంజర్‌కు చెందిన చెన్ను రాఘవులు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. సత్తుపల్లి నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు, అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టి అదే వేగంలో విద్యుత్తు స్తంభాన్ని ఢీకొంది. ప్రమాదంలో స్తంభం కూడా విరిగిపోయింది. క్షతగాత్రుడ్ని ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

దారి ఎలా కనపడేది..?



మాటూరుపేట- నిధానపురం రహదారిలో రోడ్డుకిరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చేవారు కనిపించక ప్రమాదాల బారినపడుతున్నారు. అనేక సార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదంటున్నారు. ర.భ. ఏఈ బి.రాంబాబు మాట్లాడుతూ వర్షాలు తగ్గిన తరువాత పిచ్చి మొక్కలు తొలగిస్తామన్నారు.

– మధిర గ్రామీణం, న్యూస్‌టుడే

మురుగు కదలదు.. సమస్య తొలగదు



ఇదీ వైరా మున్సిపాలిటీలోని సత్రంబజారు. వర్షం కురిసినప్పుడు వరద వెళ్లే మార్గమిది. సరైన డ్రైనేజీ లేకపోవడంతో వరద నీరు ఇళ్లు, రోడ్లపైకి చేరి అసౌకర్యంగా మారుతుంది. సాధారణ సమయంలోనూ మురుగు ముందుకు కదలదు. గతేడాది డ్రైనేజీ నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరైనట్లు ప్రకటించినా పనులు జరగలేదు. ప్రస్తుతం మురుగు ఎక్కడికక్కడ నిలిచి దుర్వాసన వస్తోంది. కమిషనర్ చింతా వేణు మాట్లాడుతూ సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

– వైరా, న్యూస్‌టుడే

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లిలోని గౌతమ్ మోడల్ స్కూల్లో ఆదివారం ఆ క్లబ్, సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో చిన్నారుల సౌకర్యార్థం ఉచిత మూగ, చెవిటి వైద్య పరీక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్యులు జనార్దన్, విక్రమ్, శివప్రసాద్, ఆశా, రవి, అనిల, అనీల్, శివరామ్, క్లబ్ బాధ్యులు దారా కృష్ణారావు, రమేశ్, దాసరి ఉమామహేశ్వరరెడ్డి, రవి, అప్పారావు, రావి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు

కల్లూరు, న్యూస్‌టుడే: దారుక బంజర్ గ్రామంలో దారి ఆక్రమణ వివాదంలో ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ షాకీర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన ప్రకారం.. ఫెన్సింగ్ ఏర్పాటుపై తలెత్తిన వివాదంలో పరస్పర ఫిర్యాదుల మేరకు బ్రహ్మసాని అర్జునరావు, కొంగర రవి, కర్నాటి రాములమ్మ, వెంకటిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

పరస్పర ఫిర్యాదులు

పెనుబల్లి: వ్యక్తిగత వివాదాల నేపథ్యంలో తమపై దాడికి పాల్పడ్డారంటూ రెండు వర్గాలు పరస్పర ఫిర్యాదుల నేపథ్యంలో వేంసూరు, సత్తుపల్లి మండలాలకు చెందిన రవీంద్రరావు, ప్రియాంక, దివ్య, చిన్నికృష్ణలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

వైరా, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు పేర్కొన్నారు. వైరాలోని హనుమాన్‌బజార్‌లో ఆదివారం నిర్వహించిన పార్టీ గ్రామ శాఖ సమావేశంలో మాట్లాడారు. నిధుల కొరత చూపిస్తూ పట్టణాలు, పల్లెల్లో అభివృద్ధి పనులు నిలిపివేయడం సరికాదన్నారు. పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, బత్తుల ప్రమీల, ఓర్సు సీతరాములు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలు కొనసాగించాలి



మాట్లాడుతున్న భూక్యా వీరభద్రం

కొణిజర్ల, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రజా పోరాటాలు కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం పేర్కొన్నారు. తనికెళ్లలో ఆదివారం నిర్వహించిన పార్టీ గ్రామ శాఖ సమావేశంలో మాట్లాడారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. చల్లా నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తాళ్లపల్లి కృష్ణ, చెరుకుమల్లి కుటుంబరావు, రంజాన్, కొప్పుల కృష్ణయ్య పాల్గొన్నారు.

పాస్టర్లకు సన్మానం

వైరా, న్యూస్‌టుడే: ఏసు జన్మించి, సంచరించిన ఇజ్రాయెల్, జెరూసలెంతోపాటు ఇతర ప్రాంతాలకు వెళ్లి తిరిగొచ్చిన పాలడుగుకు చెందిన పాస్టర్ స్టీవెన్సన్ కుటుంబ సభ్యులను పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. గౌరవాధ్యక్షుడు చిలకా చినకోటయ్య, అజరయ్య, సుధాకర్, మోదుగు వినోద్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చింతకాని, న్యూస్‌టుడే: పాతర్లపాడు, సీతంపేటకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు ఆదివారం అందజేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫారసుతో చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు బొర్రా ప్రసాదరావు, పిచ్చయ్య, నారపోగు కొండలరావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెనుబల్లి, న్యూస్‌టుడే: సూరయ్యబంజరు తండాలో దారావత్ గోపాలస్వామి అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 5క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఎస్సై వెంకటేష్ పట్టుకున్నారు. గోపాలస్వామి గత కొంతకాలంగా రేషన్ బియ్యం సేకరించి బయ్యన్నగూడెం కోళ్లఫారం మేనేజర్ వెంకటేశ్వర్లుకు ఇస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులిద్దరిపై కేసు నమోదు చేశారు.

పీహెచ్‌సీ సందర్శన



లంకాసాగర్ పీహెచ్‌సీలో పర్యటిస్తున్న వైద్యాధికారులు

పెనుబల్లి, న్యూస్‌టుడే: లంకాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య సంచాలకుడు బి.రవీందర్‌నాయక్ ఆదివారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. రక్త పరీక్షలు, మందుల నిల్వల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల వివరాల నమోదులో మూడు నెలలుగా జిల్లాలో ప్రథమ స్థానంలో ఉన్న స్థానిక వైద్యులు, సిబ్బందిని అభినందించారు. ఆవరణలో ఔషధ, పూల మొక్కలు ఏర్పాటుచేయటంపై హర్షం వ్యక్తం చేశారు. లంకాసాగర్ పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ ధ్రువీకరణ పత్రం ప్రదానం చేశారు. డీఎంహెచ్‌వో సుబ్బారావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారామ్, వైద్యాధికారి కిరణ్‌కుమార్, వైద్యురాలు సౌమ్య, సీహెచ్‌వో పూలమ్మ, హెచ్ఎస్ నాగేశ్వరరావు, పీహెచ్ఎన్ సుగుణ, హెచ్ఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

వినతి: లంకాసాగర్ పీహెచ్‌సీని సందర్శించిన డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీంద్రనాయక్‌కు వైద్య, ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం బాధ్యులు ఆదివారం వినతి పత్రాన్ని అందజేశారు. జీపీఎస్ యాప్ కెమేరా ద్వారా ఫొటో అటెండెన్స్ పద్ధతిని వైద్య ఆరోగ్య శాఖ ఫీల్డ్ సిబ్బందికి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

'ముఖ్యమంత్రి మాట తప్పినందునే ఆందోళన'

సత్తుపల్లి, న్యూస్‌టుడే: ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ఈ నెల 9న నిర్వహించతలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు ఏపూరి వెంకటేశ్వరరావు కోరారు. సత్తుపల్లిలో ఆదివారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగ ఉపకులాలకు విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అసెంబ్లీ వేదికగా మాట ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి విస్మరించడంతో ఆందోళనకు శ్రీకారం చుట్టామన్నారు. సమావేశంలో గొల్లమూడి శ్రీనివాసరావు, పరిగడుపు లక్ష్మణ్, దాసు, రాంబాబు, రాఘవ, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం'



మాట్లాడుతున్న రామాంజనేయులు

వైరా, న్యూస్‌టుడే: కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు డిమాండ్ చేశారు. ప్రైవేటు వంట కార్మికుల యూనియన్ సమావేశాన్ని ఆదివారం గారపాటి అశోక్ అధ్యక్షతన వైరాలో నిర్వహించారు. ప్రైవేటు కార్యక్రమాల్లో వంట చేసే కార్మికుల కోసం ఏ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడం లేదన్నారు. జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు, కొండా రామకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.



తల్లాడలో..



వేంసూరు: మర్లపాడులో




కల్లూరులో..



కారేపల్లిలో..

దుర్గాదేవికి పూజలు



మధిర: సుందరయ్యనగర్‌లో పూజలు



వైరా: మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు

దుర్గాదేవి అమ్మవారు భక్తులకు ఆదివారం శ్రీలలిత త్రిపుర సుందరీదేవి రూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు, మండపాల వద్ద మహిళలు ఉత్సాహంగా బతుకమ్మలు ఆడిపాడారు. సత్తుపల్లి, మధిర, వైరా పట్టణాలతోపాటు అన్ని గ్రామాల్లో బంధుమిత్రుల రాకతో గ్రామాలో సందడి నెలకొంది.

– న్యూస్‌టుడే యంత్రాంగం



వీఎం బంజరలో మహిళలు, చిన్నారుల ఉత్సాహం



చింతకాని: ఫిలడెల్ఫియాలో బతుకమ్మలతో..



మధిర: వాసవీమాత ఆలయంలో కుంకుమ పూజలు

పురవీధుల్లో ఊరేగింపు



తల్లాడ: శ్రీనివాసస్వామి ఊరేగింపులో అర్చకులు

తల్లాడ, న్యూస్‌టుడే: శ్రీహనుమత్ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం శ్రీనివాసస్వామిని తల్లాడ గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అర్చకులు దీవి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో నిత్యహోమం, కల్పవృక్ష వాహనోత్సవం, నవకుంభ స్థాపనం, ఎదుర్కోలు ఉత్సవం, కుంభాభిమర్శనం వంటి పూజలను నిర్వహించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

ఇంటర్ ధ్రువపత్రాల దరఖాస్తుకు అవకాశం

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ఇటీవల కాలంలో అధిక వర్షాల కారణంగా మున్నేరు వరద ప్రభావం వల్ల ఇంటర్మీడియట్ మార్కుల మెమో కోల్పోయిన వారు ఎలాంటి రుసుము చెల్లించకుండా తిరిగి పొందే అవకాశం ఉందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె.రవిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం tgbie.cgg.gov.in వెబ్‌సైట్‌లోని స్టూడెంట్ ఆన్‌లైన్ సర్వీసెస్ విభాగంలో ప్రత్యేక లింక్ ఇచ్చారు. సర్టిఫికెట్లు వరదల్లో కోల్పోయిన వారు చదివిన కళాశాల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్, ప్రిన్సిపల్ డిక్లరేషన్‌ను అప్‌లోడ్ చేస్తూ ఈ లింక్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే త్వరగా జారీ అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

దివాన్‌చెరువు(రాజానగరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్‌చెరువు శ్రీప్రకాశ్ విద్యానికేతన్‌లో నిర్వహిస్తున్న సీబీఎస్‌ఈ క్లస్టర్-7 బాలుర వాలీబాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ క్రీడల్లో అండర్ 17 విభాగంలో ఖమ్మం గోల్డ్ పబ్లిక్ స్కూల్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. పలువురు అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఖమ్మం: 80085 52623, 93944 50199
రఘునాథపాలెం: 8008573674
పాలేరు: 97010 67081

పాతకుంట: పెద్దతండా పంచాయతీ సాయి ప్రభాత్ నగర్‌లో డ్రైన్‌పై మట్టి పోసి రోడ్డు మాదిరిగా చదును చేశారు. స్కూల్ బస్సులు, ట్రాక్టర్లు ఇతర వాహనాలు దానిపై వెళ్తే ప్రమాదం చోటుచేసుకుంటుంది.

ఎంపీడీఓ కుమార్: పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

- ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే

తండాలో వీధిదీపాల ఏర్పాటు

తిరుమలాయపాలెం: మన్నాదుర్గం శివారు బోడతండాలో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదంటూ తండావాసులు 'మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన గ్రామ కార్యదర్శి ప్రమీనాయక్ తండాలో వీధిదీపాలు వెలగని ప్రాంతాలను గుర్తించి అక్కడ ఏర్పాటు చేశారు.

ప్రమాదకరంగా మలుపులు



నగరంలోని విజయనగర్‌కాలనీలోని పలు వీధుల్లోని మూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో కాలువలో వేసిన సిమెంటు పైపులైన్లు దెబ్బతిని కన్నాలు పడటంతో వాహనదారులు ఇబ్బందులు తప్పడం లేదు. సాయిబాబా గుడి దాటిన అనంతరం ఓ మూల మలుపులో ఉన్న కాలువ ప్రమాదకరంగా మారింది. వాహన చోదకులు ఏమాత్రం ఆదమరిచినా పెను ప్రమాదం తప్పదని, దానిపై కప్పు వేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

రహదారి రాళ్లమయం

నగరంలోని విజయనగర్ కాలనీలో ఓ రహదారికి ఇటీవల స్వల్ప మరమ్మతులు చేశారు. ప్రస్తుతం అక్కడ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. మరమ్మతులు చేసిన ప్రాంతంలో రహదారి పూర్తిగా ధ్వంసమై, రాళ్లు తేలడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఏమాత్రం అదుపు తప్పినా ప్రమాదం తప్పదని, దానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. - ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే



దూరప్రయాణికుల రద్దీ



దసరా సెలవులు, బతుకమ్మ వేడుకల నేపథ్యంలో దూర ప్రాంత ప్రయాణికులు తమ ఊళ్లకు వెళ్లేందుకు బయలుదేరారు. ఈ నేపథ్యంలో ఖమ్మం నూతన బస్టాండ్ ఆదివారం ప్రయాణికులతో కిటకిటలాడింది. హైదరాబాద్ నగరంతో పాటు, వివిధ పట్టణాల నుంచి ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఎక్కువగా ఖమ్మం బస్టాండ్‌కు చేరుకోవడంతో బస్సులు కిక్కిరిశాయి. సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు మార్గాల్లో వెళ్లే బస్సుల్లో రద్దీ నెలకొంది. ఈ చిత్రాలను 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. - ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే

కుండపోత వాన

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం కుండపోత వాన కురిసింది. పలు గ్రామాల్లో వీధులన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. వరిచేలు నీట మునిగాయి. రహదారులపై చెట్లు కూలడంతో స్థానికులు వాటిని తొలగించారు.

సిబ్బంది నిర్లక్ష్యం.. రోగుల దైన్యం

ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే: అత్యవసర సమయంలో రోగులను తరలించేందుకు ఖమ్మం సర్వజనాసుపత్రిలో చక్రాల కుర్చీల సదుపాయం కల్పించారు. కొన్ని సందర్భాల్లో రోగులకు ఈ సదుపాయం అందటం లేదు. దీంతో చేతులపై మోసుకుంటూ రోగులను వార్డులకు తరలించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. పక్షవాతంతో బాధపడుతున్న ఓ రోగి నడవలేని స్థితిలో ఆదివారం ఆస్పత్రికి వచ్చారు. చికిత్స కోసం ఆసుపత్రిలో చేరాలని వైద్యులు సూచించారు. ఓపీ విభాగం నుంచి వార్డుకు వెళ్లేందుకు మూడు చక్రాల కుర్చీ కోసం కుటుంబీకులు ప్రయత్నించగా సిబ్బంది స్పందించలేదు. దీంతో రోగిని అతని సోదరుడు చేతులపై మోసుకెళ్లి వార్డులో చేర్పించారు. ఇదే సమయంలో విధుల్లో ఉన్న సిబ్బంది ఒకరు చక్రాల కుర్చీలో ఓ డబ్బా, అందులో రెండు రిజిస్టర్లను తరలిస్తూ కనిపించారు. రోగుల పరిస్థితి పట్టించుకోకుండా చేతిలో పట్టుకెళ్లాల్సిన పుస్తకాలను చక్రాల కుర్చీలో దర్జాగా తరలించారు. ఈ దృశ్యాలను 'న్యూస్‌టుడే' కెమెరా క్లిక్‌మనిపించింది. ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంఓ వినాయక్ రాథోడ్‌ను వివరణ కోరగా సిబ్బందిని మందలించారు. మరోసారి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని వివరించారు.



రోగిని చేతులపై మోసుకెళ్తున్న అతని సోదరుడు



చక్రాల కుర్చీలో రిజిస్టర్లు తరలిస్తున్న ఉద్యోగి

రాష్ట్రపతి నిలయం సందర్శన

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన యువ టూరిజం క్లబ్ సభ్యులు ఆదివారం హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భారతీయ కళా మహోత్సవం పేరిట జరుగుతున్న ఈశాన్య రాష్ట్రాల కళలు, జీవన విధానం, ఆహారపు అలవాట్లు, ప్రాంతీయ వైవిధ్యమైన నృత్యరీతులను తిలకించారు. రాష్ట్రపతి భవన్, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి మంత్రిత్వశాఖ, భారతీయ సాంస్కృతికశాఖ సంయుక్తంగా గత నెల 29న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రారంభించిన కళా మహోత్సవం ఆదివారంతో ముగిసింది. కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ప్రత్యేక పర్యటనను బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మొహ్మద్ జకీరుల్లా, యువ టూరిజం క్లబ్ సమన్వయకర్త ఎంవీ రమణ, అధ్యాపకులు శ్రీనివాస్, వై.రవివర్దన్ పాల్గొన్నారు.



రాష్ట్రపతి నిలయం వద్ద విద్యార్థులతో ప్రిన్సిపల్ మొహ్మద్ జకీరుల్లా

వాడవాడలా పూల వేడుక



స్తంభాద్రి గుట్టపై సంతానలక్ష్మి అలంకరణలో అమ్మవారు



వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి శేషవస్త్రాలు అందిస్తున్న మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు దంపతులు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని పలు ప్రాంతాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. స్తంభాద్రి గుట్టపై సంతానలక్ష్మిగా, జమ్మిబండపై శాకాంబరిగా అమ్మవారు దర్శనమిచ్చి ప్రత్యేక పూజలందుకున్నారు. విజయనగర్‌కాలనీ, ఆరో డివిజన్‌లో, భారాస కార్యాలయంలో బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వాహకులు మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు దంపతులు అమ్మవారి శేష వస్త్రాలను భక్తులకు అందజేశారు.

✦ వి.వెంకటాయపాలెం బొడ్రాయి కూడలిలో అమ్మవారు లలితా దేవి అలంకారంలో భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు.

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఖమ్మం వీడీఓ కాలనీలోని టీఎన్జీఓ భవన్ ఆవరణలో ఆదివారం రాత్రి టీఎన్జీఓ ఉద్యోగులు బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఐదోరోజు బతుకమ్మలను మహిళా ఉద్యోగులు పేర్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో బతుకమ్మ ఆటపాటల్లో పాల్గొన్నారు. టీజీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, నగర మేయర్ నీరజ, స్థానిక కార్పొరేటర్ మంజుల ఉత్సాహంగా బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలాడారు.

కూసుమంచి, న్యూస్‌టుడే: చేగొమ్మలో ఆదివారం బతుకమ్మల సందడి నెలకొంది. మహిళలు బతుకమ్మలతో ప్రదర్శనగా స్థానిక చెరువు వద్దకు వెళ్లి ఆడుతూ, పాడుతూ గౌరమ్మను కొలిచారు.



జమ్మిబండపై శాకాంబరి అలంకారం



భారాస కార్యాలయంలో యువతి శాస్త్రీయ నృత్యం



వి.వెంకటాయపాలెం బొడ్రాయి కూడలిలో..



విజయనగర్ కాలనీలో కోలాటమాడుతున్న మహిళలు



బతుకమ్మ వేడుకలో ఏలూరి శ్రీనివాసరావు, మేయర్ నీరజ

'కొండ సురేఖ వ్యాఖ్యలు సరికావు'

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: అక్కినేని నాగార్జున కుటుంబంపై మంత్రి కొండ సురేఖ చేసిన వ్యాఖ్యలు సరి కావని తెదేపా లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కమ్మ మహాజన సంఘం మాజీ డైరెక్టర్ గొల్లపూడి రామారావు డిమాండ్ చేశారు. గవర్నర్‌తోపాటు సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాహుల్‌గాంధీకి ఆదివారం లేఖ రాశారు. నాగార్జున కుటుంబాన్ని టార్గెట్ చేస్తున్నారని, ఎన్-కన్వెన్షన్ సెంటర్‌ను కూల్చివేశారని ఆరోపించారు. సురేఖను వెంటనే మంత్రి వర్గం నుంచి తప్పించకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఆర్ఎంపీ వైద్యం.. ప్రాణాపాయ స్థితిలో చిన్నారి

కామేపల్లి, న్యూస్‌టుడే: అర్హత లేకున్నా కొందరు ఆర్ఎంపీలు డబ్బు సంపాదనే లక్ష్యంగా స్థాయికి మించి వైద్యం చేస్తుండటంతో పలువురు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. కామేపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన చిన్నారి వారం క్రితం జ్వరం, దగ్గుతో బాధపడుతుండగా ఆమె తండ్రి స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. సదరు ఆర్ఎంపీ తొలి రెండు రోజులు రెండేసి చొప్పున సూదులు ఒకేచోట తొంటి భాగంలో వేశారు. జ్వరం తగ్గకపోగా సూదులు చేసిన చోట ఇన్‌ఫెక్షన్ కావడంతో చిన్నారి తీవ్ర అస్వస్థతకు గురైంది. తల్లిదండ్రులు చిన్నారిని వైద్యసేవల నిమిత్తం ఖమ్మం సర్వజనాసుపత్రికి, అక్కడ నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఐయూసీలో ఉంచి వైద్యసేవలు అందిస్తున్నారు. జ్వరం నయమవుతుందని వెళ్తే ఆర్ఎంపీ వైద్యంతో ప్రాణాపాయ స్థితికి చిన్నారి చేరుకుందని చిన్నారి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఠాణాలో ఆర్ఎంపీపై ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

ఆటో బోల్తా.. ఒకరికి గాయాలు

కామేపల్లి, న్యూస్‌టుడే: డ్రైవర్‌కు ఫిట్స్ రావటంతో ఆటో బోల్తాపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఊట్కూర్‌కు చెందిన స్థానికులు ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లి తిరిగొస్తుండగా.. పండితాపురం సమీపంలో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో రబీయా బీకి గాయాలయ్యాయి. అంబులెన్సులో ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న మెకానిక్‌లు, చిత్రంలో బాలసాని

వరద బాధితులకు ఆర్థిక సాయం

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: మున్నేరు వరదలతో టూవీలర్ మెకానిక్‌ల జీవితాలు రోడ్డున పడ్డాయి. వరదల్లో మెకానిక్ వృత్తిపై ఆధారపడే కుటుంబాలు, పలు మెకానిక్ దుకాణాలు ధ్వంసమయ్యాయి. దీంతో ఖమ్మం నగర టూవీలర్ మెకానిక్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా, ఏపీ, తెలంగాణ మెకానిక్‌లు అందరూ కలిసి జమ చేసిన రూ.4 లక్షలను మెకానిక్ కుటుంబాలకు ఆదివారం అందజేశారు. తుమ్మల క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మిక్కిలినేని నరేంద్ర చేతుల మీదుగా నగదు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వంగాల కొండల్‌రావు, కిలారు బాబాజీ, కృష్ణారెడ్డి, రాము, నరసింహారావు, కౌసర్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన కేంద్రంలో ముగిసిన శిక్షణ

కూసుమంచి, న్యూస్‌టుడే: నాగర్‌కర్నూల్ జిల్లా మత్స్యకారులకు పాలేరులోని మత్స్య పరిశోధన కేంద్రంలో మూడు రోజులపాటు నిర్వహించిన నైపుణ్య శిక్షణ ఆదివారం ముగిసింది. చివరి రోజు చేపల మేత తయారీ విధానంతోపాటు, నీటి నాణ్యతా ప్రమాణాల గుర్తింపు, చేపల వ్యాధులు-నివారణ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ... పోషక విలువలున్న చేపల మాంసంపై ప్రజల్లో అవగాహన పెరిగిందని, మత్స్య రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ పొందిన మత్స్యకారులకు ధ్రువపత్రాలు అందించారు. శాస్త్రవేత్త రవీందర్ పాల్గొన్నారు.



← చేపల మేత తయారీ విధానంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నగరంలో సినిమాలు.. శ్రీనివాస: సత్యం సుందరం శ్రీసాయిరాం: స్వాగ్, శ్రీ తిరుమల, వినోద: దేవర పార్ట్-1, సీఎన్ సినీ గెలాక్సీ: దక్షిణ కేపీఎస్: రాంనగర్ బన్నీ(రెండు ఆటలు), జోకర్(రెండు ఆటలు)

ముందస్తు పరీక్షలతో థలసీమియా నివారణ

ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే: వివాహానికి ముందు థలసీమియా నిర్ధారణ కోసం హెచ్‌బీఏ2(ఎలక్ట్రోఫోర్సెస్) పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలని, ఈ పరీక్షలతోనే వ్యాధిని శాశ్వతంగా నిర్మూలించగలుగుతామని హెమటాలజిస్ట్ డాక్టర్ దండమూడి రమణ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని ఓ హోటల్‌లో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో థలసీమియా, సికిల్ సెల్ ఎనీమియాపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి చెందిన దేశాల్లో థలసీమియా కేసులు నమోదు కావడం లేదన్నారు. ఆ దేశాల్లో హెచ్‌బీఏ-2 పరీక్షలను ప్రభుత్వాలు తప్పనిసరి చేశాయని వివరించారు. దీంతో ఏ ఇద్దరు క్యారియర్‌లు వివాహం చేసుకోవడం లేదని, వ్యాధితో చిన్నారులు జన్మించడం లేదన్నారు. మందులు వేసుకోవడంలో సమయపాలన పాటిస్తారని చెప్పారు. మన రాష్ట్రంలో వ్యాధిగ్రస్థ చిన్నారులకు రక్తం, మందులు సమయానికి అందించాలన్నారు. సదస్సులో డి.నారాయణమూర్తి, జితేందర్, మురళికృష్ణ, సరిత, సంస్థ బాధ్యులు పి.పావని, పి.అనిత, రవిచందర్, ఉదయ్‌భాస్కర్, ఎన్.ఉపేందర్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో మేయర్ పూజలు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: శ్రీధర్మశాస్తా అయ్యప్ప దేవాలయ నిర్మాణంలో భాగంగా ఆదివారం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో మేయర్ పునుకొల్లు నీరజ దంపతులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్లు చావా మాధురి, సరిపూడి రమాదేవి కమిటీ సభ్యులు నారాయణరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఆందోళన చేయాలి

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఖమ్మం నగరంలో ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై ఆందోళన చేయాల్సిన అవసరం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్ పిలుపునిచ్చారు. ఎన్ఎస్‌టీరోడ్‌లో ఆదివారం నిర్వహించిన 51, 52 డివిజన్ల మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రమేష్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో వర్గ పోరాటాలు: నున్నా

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: అమరవీరుల స్ఫూర్తితో వర్గ పోరాటాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మంగళగూడెంలో ఆదివారం పార్టీ సీనియర్ నాయకుడు కొప్పుల చిన్నజనార్దన్ సంస్మరణ సభను నిర్వహించారు. నాయకులు బండి రమేశ్, మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేకి: శ్రీధర్‌రెడ్డి



సభ్యత్వ నమోదు చేపడుతున్న శ్రీధర్‌రెడ్డి

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంతో ప్రజలు విసిగిపోయారని భాజపా కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తల్లంపాడులో ఆదివారం నిర్వహించారు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు, కూలీలు తమ పార్టీని ఆదరిస్తున్నారని, గతంలో ఎన్నడూ లేని విధంగా సభ్యత్వ నమోదుకు పల్లెల్లో స్పందన వస్తుందన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంత ఉపేందర్‌గౌడ్, నలమాస శ్రీనివాసరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఖో అంటే చేగొమ్మ..

పూర్వ విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకుని రాణిస్తున్న చిన్నారులు

కూసుమంచి, న్యూస్‌టుడే

ఖోఖో అనగానే గుర్తొచ్చేది చేగొమ్మ జడ్పీ ఉన్నత పాఠశాల. పూర్వ విద్యార్థులు పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయి పాఠశాలల క్రీడా పోటీల్లో సత్తాచాటారు. ప్రస్తుత విద్యార్థినులు ఆ స్ఫూర్తిని అందుకుని పాఠశాల పీడీ రాజు శిక్షణలో నైపుణ్యం సాధిస్తున్నారు. 30మంది విద్యార్థినులు ప్రతీ రోజు సాధన చేస్తున్నారు. ఇటీవల పాఠశాలల జోనల్, జిల్లా స్థాయి పోటీల్లో నైపుణ్యం ప్రదర్శించారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో జట్టు జోనల్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది.

జిల్లా స్థాయికి పది మంది..

ముదిగొండలో జరిగిన జోనల్ పోటీల్లో అండర్-14 విభాగంలో డి.రిషిత, ఎం.సింధు, పి.లాస్య, త్రివేణి, ధనలక్ష్మి, అండర్-17 విభాగంలో ఎం.అక్షర, వి.స్నేహ, ఆర్.దివ్య, డి.నిఖిత, అభినయశ్రీ రాణించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపియ్యారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ముగ్గురు



కొద్ది రోజుల క్రితం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలు, ఎంపికల్లో ప్రతిభ చూపిన ముగ్గురు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. అండర్-17లో 9వ తరగతి విద్యార్థిని ఎం.అక్షర, అండర్-14లో డి.రిషిత, ఎం.సింధు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు.

➡ 'పాఠశాల విద్యార్థినుల్లో మొదటినుంచి ఖోఖోపై ఆసక్తి ఉంది. గతంలో జాతీయ స్థాయిలో ఆడిన సందర్భాలున్నాయి. ఇక్కడి నుంచి మళ్లీ ఆ స్థాయి క్రీడాకారులు తయారవుతారు.' - రాజు, పీడీ.



ఖోఖో ఆటలో తర్ఫీదు పొందుతున్న బాలికలు

సీసీ కెమెరా దృశ్యాలు విడుదల

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: ఖమ్మం నగరంలో ఇటీవల చోటుచేసుకున్న దొంగతనాలతో సంబంధం ఉందంటూ ఖమ్మం పోలీసులు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి చిత్రాన్ని విడుదల చేశారు. చోరీలు జరిగిన ప్రదేశాల్లోని సీసీ కెమెరాలు పరిశీలించి దొంగతనాలకు పాల్పడింది అతనేనని గుర్తించినట్లు మీడియాకు తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే పోలీసులకు సమాచారం చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఏసీపీ ఫోన్ నెంబర్ 87126 59105, ఖానాపురం హవేలి ఠాణా నెంబర్ 87126 59119.



యువకుడి బలవన్మరణం.. కేసు నమోదు

కామేపల్లి, న్యూస్‌టుడే: యువకుడి మృతిపై ఠాణాలో ఆదివారం కేసు నమోదైంది. ఎస్సై సాయి కుమార్ కథనం మేరకు.. పాతలింగాలకు చెందిన యరకాల అశోక్‌కుమార్(32) మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో ఇంట్లో పంకాకు చున్నీతో ఉరేసుకుని శనివారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతడి తల్లి కోటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.